సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం, 24, ఫిబ్రవరి, 2023



నాడు-నేడు స్ఫూర్తితో సబ్‌స్టేషన్ సుందరీకరణ

గడికోట గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సుందరీకరణ పనులు చేపట్టినట్లు విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ తెలిపారు. -8లో..



మండుతున్న గట్టు కొండ

బి.కొత్తకోట-మదనపల్లె మార్గం కొండ కిందపల్లె సమీపంలోని గట్టుకొండకు గురువారం కొందరు నిప్పు పెట్టారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 271 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	603	671
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 531.56 కిలోలు

ఆ పత్రికలవి అసత్య కథనాలు

- వివేకా హత్యపై అబద్ధపు రాతలు రాయడం దుర్మార్గం
- ఎల్లో మీడియాపై ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

వల్లూరు: వైఎస్సార్‌సీపీ నేతల మనోభావాలను దెబ్బతీయడమే ధ్యేయంగా మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య సంఘటనపై ఎల్లో మీడియా అసత్య కథనాలను ప్రచురిస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి విమర్శించారు. కడపలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2018 ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ కలిసి వివేకానందరెడ్డి పేరును ఏకగ్రీవంగా ప్రతిపాదించారని , అప్పటి టీడీపీ ప్రభుత్వం కుట్రలు పన్ని ఆయనను ఓటమి పాలు చేసిందని విమర్శించారు. 2014 ఎన్నికలతో బాటు 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి వివేకానందరెడ్డి కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా 2019 పార్లమెంటు ఎన్నికల్లో అవినాష్‌రెడ్డి విజయానికి పూర్తి స్థాయిలో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన చనిపోవడానికి ముందు రోజు కూడా పార్టీ విజయం కోసం కష్టపడ్డారని, ఈ విషయం అందరికీ తెలుసు నని అన్నారు. అలాంటిది కేవలం వారు కోరుకున్న వారికి లబ్ధి చేకూర్చే క్రమంలో వైఎస్‌ఆర్‌సీపీని దెబ్బతీయడమే ప్రధాన ధ్యేయంగా ఎల్లో మీడియా అబద్ధపు రాతలు రాయడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

న్యాయం గెలవాలి.. నిజం తేలాలి

- అబద్ధాల రాతలపై వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నిరసనలు
- ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల దహనం



కడప: ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో న్యాయం గెలవాలి...నిజం తేలాలని వైఎస్సార్‌సీపీ నేతలు నినదించారు. సీబీఐ దర్యాప్తు జరుగుతున్న విధానం, పచ్చ పత్రికల విషపురాతలపై ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో గురువారం నాయకుల్లో ఆగ్రహం పెల్లుబికింది. వైఎస్సార్ జిల్లా కడప ఏడు రోడ్ల కూడలిలో ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం నాయకులు చేసి, ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై ఉద్దేశ్యపూర్వకంగా బురదజల్లుతూ కేసులో ఇరికించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. టీడీపీ చెప్పినట్లే సీబీఐ విచారణ సాగుతోందని, సీబీఐ అధికారిపై అందరిలోనూ అనుమానాలు న్నాయన్నారు. తప్పుడు స్టేట్‌మెంట్లు ఇవ్వాలని వివేకా పీఏ కృష్ణారెడ్డి, కువైట్ గంగాధర్, ఉదయ్ కుమార్ లను ఆయన బెదిరించారన్నారు. నిజాలను వెలికి తీయాల్సిన సీబీఐ అధికారులే ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకొని విచారణ చేయడం అన్యాయమన్నారు. వివేకా మరణవార్త విషయం వైఎస్ అవినాష్‌రెడ్డికి తెలిసింది ఆయన బావమరిది శివప్రకాష్‌రెడ్డి ద్వారానే అన్నారు. సునీల్ యాదవ్ అవినాష్‌రెడ్డి ఇంట్లో ఉన్నారని, హత్య విషయం ఆయనకు ముందే తెలుసునని విషపురాతలు రాయడం దారుణమన్నారు. వివేకా రాసినట్లుగా చెబుతున్న లేఖను సీబీఐ ఎందుకు దాస్తోందో చెప్పాలన్నారు. సీబీఐ కోర్టుకు సమర్పించిన కౌంటర్ బెయిల్ కాపీలు కోర్టుకు చేరకమునుపే పచ్చ పత్రికల్లో అచ్చు వేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలు రాస్తున్న పచ్చ పత్రికలకు చరమగీతం పాడాలన్నారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పి ప్రజలను నమ్మించాలి అనుకోవడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. ఇప్పటికైనా సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా జరగాలన్నారు. కడిగిన ముత్యంలా వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ కేసు నుంచి బయటికి వస్తారన్నారు. సీబీఐ నిజానిజాలు తేల్చి న్యాయాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, కార్పొరేటర్లు ఎం. మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, కె. బాబు, షఫీ, నాయకులు బంగారు నాగయ్య, ఎస్. సుబ్బారెడ్డి, సీహెచ్ వినోద్, తోటకృష్ణ, బండి ప్రసాద్, పస్తం అంజి, మునిశేఖర్ రెడ్డి, రహీమ్, అర్జున్, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, సునీత, నారాయణమ్మ, మల్లీశ్వరి, సుశీలమ్మ, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల : గురువారం వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయమై ఈనాడు, ఆంధ్ర జ్యోతి దిన పత్రికలలో వచ్చిన కథనాలపై పులివెందుల వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసులో చంచల్ గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న సునీల్ యాదవ్ హైదరాబాద్ సీబీఐ కోర్టులో వేసిన బెయిల్ పిటిషన్‌పై సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. దీనిపై గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఇతర నేతలపై ఎల్లో మీడియాలో అసత్య కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్థానిక పూలంగళ్ల సర్కిల్‌లో ఏబీఎన్ డౌన్ డౌన్, ఈనాడు డౌన్ డౌన్, రామోజీ డౌన్ డౌన్, రాధాకృష్ణ డౌన్ డౌన్, సీబీఐ విచారణపై అనుమానాలు అంటూ నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ ఈనాడు, ఆంధ్ర జ్యోతి దినపత్రికలను దహనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బలరామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, పుష్పనాథరెడ్డి, వేణుగోపాల్ యాదవ్, లింగాల మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, మండల నాయకులు అంబకపల్లె బాబురెడ్డి, సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, రామట్లపల్లె జగన్‌మోహన్‌రెడ్డి, లోపట్నూతల నాగభూషణంరెడ్డి, వేముల మండల నాయకులు సాంబశివారెడ్డి, లింగాల రామలింగారెడ్డి, మరకా శివకృష్ణారెడ్డి, తొండూరు మండల నాయకులు రవీంద్రనాథరెడ్డి, పాలూరు వేణుగోపాల్‌రెడ్డి, రామమునిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై ఎల్లో మీడియా విషపు రాతల్ని నిరసిస్తూ గురువారం మైదుకూరులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కూశెట్టి రాయుడు, ఖాదర్, షాషా, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై నిందలు మోపితే సహించేది లేదు

పెనగలూరు: అన్నమయ్య జిల్లా పెనగలూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఈనాడు ప్రతులను కాల్చివేశారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, మాజీ జెడ్పీటీసీ ఎర్రి నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వంపై ఈనాడు నిందలు మోపితే సహించేది లేదన్నారు. టీడీపీ దుష్ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు.

పుల్లంపేట: ఈనాడు ప్రతులను గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు కాల్చివేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు, వైఎస్సార్‌సిపి నాయకులు బేకే మణి, పార్థసారథిలు మాట్లాడుతూ ప్రభుత్వంపై ఈనాడు నిందలు మోపితే సహించేది లేదన్నారు.

ఈనాడుకు గుణపాఠం తప్పదు

- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు: ప్రభుత్వంపై విషం చిమ్మేలా తప్పుడు సమాచారం ఇస్తున్న ఈనాడు పత్రికకు, దాని అధినేతకు ప్రజలచే గుణపాఠం తప్పదని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అసత్య కథనాలను ప్రచురించిన ఈనాడు ప్రతులను, రామోజీరావు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. పట్టాభి విషయంలో ప్రభుత్వంపై విషం చిమ్మేలా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ పాత ఫొటోలు ప్రచురించడం సిగ్గుమాలిన చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, పోలీసులు చట్టప్రకారం నడుచుకుని పట్టాభిని ఇబ్బంది పెట్టకపోయినా చంద్రబాబు ఆదేశాలతో అవాస్తవాలు వల్లించడం ఈనాడుకే చెల్లిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తుండటంతో ఇక జీవితంలో అధికారం దక్కదని భావించి రామోజీరావుతో కలిసి చంద్రబాబు ప్రజా ప్రభుత్వంపై విషం చిమ్మే పనులు చేస్తున్నారని దుయ్యబట్టారు. రామోజీరావు, రాధాక్రిష్ణ ఎన్ని విషపు రాతలు రాసినా వైఎస్ జగన్‌పై ఉన్న ప్రజాభిమానాన్ని మార్చలేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, ఉపసర్పంచ్ తోట శివసాయి, సీహెచ్. రమేష్, మందల నాగేంద్ర, మందల శివయ్య, బండారు మల్లికార్జున, జనార్దన్‌రాజు, రౌఫ్, మల్లు క్రిష్ణారెడ్డి, రమేష్, శ్రీరామ్ వినోద్, తుమ్మల సురేష్, డమ్ము రఘు, డి.వి.రమణ, మనోహర్ యాదవ్, పసుపులేటి దాము, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



పులివెందుల పూలంగళ్ల సర్కిల్ వద్ద ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రతుల దహనం



రైల్వేకోడూరు: రామోజీరావు దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న విప్ కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

న్యూస్‌రీల్

రూ.30.29 లక్షల వరద పనులకు టెండర్లు

బి.కొత్తకోట: అన్నమయ్య, చిత్తూరుజిల్లాల పరిధిలో సాగే ఏవీఆర్ హంద్రీనీవా ప్రాజెక్టు రెండో దశలో వరదతో దెబ్బతిన్న పనులు చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానించినట్లు ప్రాజెక్టు ఎస్ఈ సీఆర్.రాజగోపాల్ గురువారం తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో పుంగనూరు ఉపకాలువకు పడిన గండ్ల పూడ్చివేత పనులు సాగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం మదనపల్లె నియోజకవర్గం, చిత్తూరుజిల్లాలోని పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల పరిధిలో పుంగనూరు ఉపకాలువపై కిలో మీటర్ 165.00 నుంచి 220.00 కిలోమీటర్ వరకు 14 పనులు చేపట్టి పూర్తి చేసేందుకు రూ.30,29,299 అంచనాతో టెండర్లు ఆహ్వానించామని తెలిపారు. మార్చి మూడవ తేదీ లోపు టెండర్లను దాఖలు చేసేందుకు గడువు ఉందని తెలిపారు. కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనవచ్చని తెలిపారు.

పెట్రోల్‌బంకుల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి రఘురాం

రాజంపేట రూరల్: పెట్రోల్‌బంక్‌ల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ రఘురాం పేర్కొన్నారు. పట్టణ, మండల పరిధిలోని పలు పెట్రోల్ బంక్‌లను స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ డీ. శ్రీనివాసులతో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్ బంక్‌ల్లో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటివి ఏర్పాటు చేయాలన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న స్టేట్ నోడల్ అధికారి విజయ్‌కుమార్

రక్తహీనత రహిత రాష్ట్ర సాధనే లక్ష్యం

వాల్మీకిపురం: రక్తహీనత రహిత రాష్ట్ర సాధనే లక్ష్యమని చైల్డ్ హెల్త్ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నగరిమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫి, డాక్టర్ కీర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవం.. ధ్వజావరోహణం

- ముగింపుదశకు శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు



ధ్వజావరోహణం నిర్వహిస్తున్న రుత్వికులు, ఆలయ ప్రధాన అర్చకులు

రాయచోటిటౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజావరోణంతో బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి.గురువారం యాగశాలలో వేదపండితులు నందుల మఠం శశిభూషణ్ సిద్ధాంతి ఆచారత్వాన ఋత్వికులు, ప్రధాన అర్చకులు, పాలక మండలి అధ్యక్షులు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైఎస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. మహాపూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ధ్వజావరోణం నిర్వహించారు. అంతకుముందు ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం జరిగింది. పసుపు, కుంకుమ, గంధంతో కూడిన నీళ్లను భక్తులు చల్లుకున్నారు.రాత్రికి స్వామి వారు హంస వాహనంపై మాడవీధులు, పుర వీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు రత్నశేఖర్‌రెడ్డి, సురేష్ బాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.




వసంతోత్సవాల్లో రంగునీళ్లు చల్లుకుంటున్న భక్తులు, అర్చకులు, అధికారులు

వృద్ధుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాదీక్‌అలీ

ములకలచెరువు : వృద్ధుడి హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారిని సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సాదీక్ అలీ గురువారం హాజరు పరిచారు. ఈ సందర్భంగా వివరాలు వెల్లడించారు. మండలంలోని బురకాయల కోట పంచాయతీ యర్రమాసివారిపల్లెకు చెందిన వై.శంకర్‌నాయుడు(58)పై అదే గ్రామానికి చెందిన వై.శ్రీనివాసులు(39), కుమారుడు వై.వెంకటేష్(19) ఈ నెల 20న దాడి చేసి పరారయ్యారు. వై.శంకర్‌నాయుడు చికిత్స పొందుతూ రెండు రోజుల తర్వాత మృతి చెందాడు. భార్య వై.ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో డీఎస్పీ కేశప్ప పర్యవేక్షణలో సీఐ సాదీక్ అలీ కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులోని నిందితులను గురువారం తంబళ్లపల్లె రోడ్డు సమీపంలో అరెస్టు చేశారు. నగదు లావాదేవీలు, వివాహేతర సంబంధం కారణంగా దాడి చేసినట్లు నిందితులు దర్యాప్తులో అంగీకరించారు. సమావేశంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండుతున్న గట్టు కొండ


కాలుతున్న గట్టు కొండ, దట్టమైన పొగ

బి.కొత్తకోట : అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట–మదనపల్లె మార్గం కొండకిందపల్లె సమీపంలోని గట్టుకొండకు గురువారం సాయంత్రం కొందరు నిప్పు పెట్టడంతో మండుతోంది. మండలంలో హార్సిలీహిల్స్ తర్వాత అతి ఎత్తులో కలిగిన ఈ గట్టు కొండపై అటవీ సంపద అధికం. వేసవి ప్రారంభం కానుండటంతో కొండకు నిప్పు పెట్టడంతో వృక్షాలు, మొక్కలు, గడ్డి కాలిపోతూ కొండంతా మంట విస్తరిస్తోంది. అందులోని జంతువులు కొండ కిందికి వస్తున్నాయి. నిప్పు పెడితే వర్షాలకు గడ్డి ఏపుగా పెరుగుతుందని ఇలా చేస్తుంటారని చెబుతున్నారు. మంటల విషయం తెలుసుకొన్న అటవీ సిబ్బంది ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా మంటలకు దట్టమైన పొగ వ్యాపించి కొండకిందపల్లె, బుచ్చిరెడ్డిగారిపల్లె, దేగానిపల్లెలను కమ్మేసింది. ఈ పొగకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాడు–నేడు స్ఫూర్తితో
సబ్‌స్టేషన్ సుందరీకరణ


సుందరీకరించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి

వీరబల్లి : మండల పరిధి గడికోట గ్రామంలో నాడు–నేడు స్ఫూర్తితో విద్యుత్ సబ్‌స్టేషన్ సుందరీకరణ పనులు చేపట్టినట్లు విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. సుందరీకరించిన సబ్‌స్టేషన్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పనులు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాలివీటి విజయ్ భాస్కర్‌రెడ్డి, గాలివీటి మురళీ మోహన్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ యువనాయకుడు గాలివీటి మదన్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కోదండ రామస్వామి సన్నిధిలో..

ఒంటిమిట్ట(సిద్దవటం): ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటర్ కమిషన్ చైర్మన్, జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్, సిబ్బంది, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ మునిశంకరయ్య, ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఈ మురళీధర్‌రెడ్డి, ఏఈ ఉదయ్‌కుమార్, సిబ్బంది, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జాకీర్‌హుస్సేన్

రాజంపేట టౌన్ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారత అధికారి (డీఎస్‌సీడబ్ల్యూ అండ్ ఈఓ) డి.జాకీర్ హుస్సేన్ తెలిపారు. స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్–2లో గురువారం పదో విద్యార్థులకు ప్రేరణ తరగతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశ, వ్యక్తిత్వ వికాస నిపుణులతో ప్రత్యేకంగా ప్రేరణా తరగతులు నిర్వహింప చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠ్యాంశ నిపుణులు విద్యార్థులు సులువుగా మార్కులు సాధించేందుకు పాటించాల్సిన మెలకువలను తెలియజేశారు. పాఠ్యాంశాల్లో విద్యార్థుల సందేహాలను నిపుణులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ ప్రేమ్‌సాగర్, వసతి గృహ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రామాంజులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు నరహరి, పాఠ్యాంశాల నిపుణులు, రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాలకు చెందిన ఎస్సీ వసతి గృహాల టెన్త్ విద్యార్థులు, ఆయా వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

వడ్డెర్లకు గుర్తింపు ఇచ్చిన సీఎం జగన్

– 2 ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించడం హర్షణీయం


వడ్డెర సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు రమణ

రాజంపేట : రాష్ట్రంలో వడ్డెర్ల సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపు ఇచ్చారని వడ్డెర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, వడ్డెర్ల ఉద్యోగుల సంఘం గౌరవ సలహాదారుడు కేవీ రమణ అన్నారు. రాజంపేటలోని తన కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను వడ్డెర్లకు కేటాయించడం అభినందనీయమన్నారు. వడ్డెర కులస్తులు అయిన గుంటూరు జిల్లాకు చెందిన చంద్రగిరి యేసురత్నం, ఏలూరు జిల్లాకు చెందిన జయమంగళ వెంకటరమణ ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న 30 లక్షల మంది వడ్డెరలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

సమయం పాటించకపోతే చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ శేఖర్

గాలివీడు : విధి నిర్వహణలో సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ శేఖర్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమయపాలన పాటించని సచివాలయ సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ సచివాలయ పరిధిలో 15 గ్రామ సచివాలయాలలో సమయపాలన పాటించలేదనే కారణంతో 52 మందికి ఫిబ్రవరి 3న షోకాజు నోటీసులు అందజేశామన్నారు. వీరిలో 16 మంది మినహా మిగతా సిబ్బంది సంజాయిషీ కూడా ఇవ్వకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆగ్రహించిన ఎంపీడీఓ తిరిగి గురువారం మిగిలిన 36 మందికి రెండో మారు షోకాజ్ నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న సిబ్బంది సరియైన కారణాలతో శుక్రవారం లోపు సంజాయిషీ ఇవ్వకుంటే ఫిబ్రవరి నెల జీతం నిలుపుదలతోపాటు క్రమశిక్షణ చర్యల కోసం జిల్లా అధికారులకు నివేదికలు పంపుతామని ఆయన తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

కలకడ : మండల పరిధి కలకడ ఇందిరమ్మ కాలనీ వద్ద గురువారం రాత్రి చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై మోటార్ సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన చిన్నకోట్ల వెంకటేశు కుమారుడు జయరాం (50) ద్విచక్ర వాహనంలో కలకడ నుంచి స్వగ్రామం గుడిబండకు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జయరాంకు భార్య భాగ్యలక్ష్మి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని చీకలబైలు పంచాయతీ జమ్మికుంటపల్లెకు చెందిన ఓబులప్ప కుమారుడు జోలెపాళెం కృష్ణప్ప(57) ఈ నెల 10 నుంచి కనిపించలేదని భార్య పద్మావతమ్మ గురువారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పరిసర ప్రాంతాలు, బంధుమిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపింది. ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

మదనపల్లె : ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లెలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన వెంకటరమణ భార్య కీర్తి (33) చేనేత కార్మికురాలిగా పని చేస్తోంది. ఏడాదిగా ఆమె కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు చేయించినా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 5న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలిని కుటుంబ సభ్యులు బెంగళూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందింది. మృతురాలి తల్లి పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన ఈశ్వరయ్య

పెనగలూరు : మండలంలోని కాకర్లవారిపల్లి పంచాయతీ పాతవడ్డిపల్లెకు చెందిన తురక ఈశ్వరయ్య (40) బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ మల్లికార్జున తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈశ్వరయ్య భార్య రమణమ్మ భర్తకు చెప్పకుండా 20 రోజుల క్రితం ఆమె తల్లిదండ్రుల తరపున కువైట్ వెళ్లింది. దీంతో అతను మద్యానికి బానిసై మనోవేదనకు గురై ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఇరుగుపొరుగు వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

వాల్మీకిపురం సీఐ వీఆర్‌కు బదిలీ

– ఇద్దరు కానిస్టేబుళ్లు కూడా..


సీఐ బీఎస్ సురేష్

కలికిరి : నియోజకవర్గంలోని వాల్మీకిపురం సీఐ బీఎస్ సురేష్‌తోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లను వీఆర్‌కు బదిలీ చేస్తూ అన్నమయ్య జిల్లా కేంద్రం ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయనతో పాటు ఆయన ముఖ్య అనుచరులుగా ఉన్న కలికిరి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ రామాంజినేయులు, వాయల్పాడు కానిస్టేబుల్ సతీష్‌కు కూడా జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో వారు గురువారం ఎస్పీ కార్యాలయంలో హాజరైనట్లు సమాచారం. సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకోవడం, అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వాల్మీకిపురం ఇన్‌చార్జి సీఐగా కలకడ సీఐ నాగేంద్ర బాధ్యతలు చేపట్టారు.

చౌక బియ్యం సీజ్

గాలివీడు : మండల కేంద్రంలోని పెద్దూరు రోడ్డు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు బిల్డింగ్‌లో 148 చౌక దుకాణం బియ్యం (7012 కేజీలు) సీజ్ చేసినట్లు విజిలెన్స్ అధికారి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు రెడ్డప్ప, రామకృష్ణ తెలిపారు. గాలివీడు బస్టాండ్ పెద్దూరు మధ్యలో రేషన్ బియ్యం నిల్వ ఉన్న సమాచారం అందుకున్న వారు స్థానిక తహసీల్దార్ దైవాదీనం, డీటీ తిమ్మారెడ్డితో కలిసి దాడి చేశారు. 148 బస్తాల బియ్యాన్ని పెద్దూరులోని ఎఫ్‌పీ షాప్‌కి తరలించి క్రిమినల్ కేసు నమోదు చేశారు.